క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి రూ.1.50లక్షల ఆర్థిక సాయం



లింగాల(వత్సవాయి): లింగాల గ్రామానికి చెందిన గ్రామ సచివాలయ కన్వీనర్ అంబోజీ వెంకటకృష్ణ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందగా, అతని స్నేహితులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. 1989–90లో పదోతరగతి చదువుకున్న స్నేహితులంతా ఆదివారం లింగాలలో కలిశారు. నాటి తమ సహవిద్యార్థి, ఇటీవల మృతిచెందిన అంబోజీ వెంకటకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. అనంతరం వెంకటకృష్ణ కుమారుడికి రూ.1.50లక్షలను అందజేసి తమ పెద్దమనస్సును చాటుకున్నారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి అండగా ఉంటాయని వారు తెలిపారు. వెంకటకృష్ణ కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, రంగిశెట్టి ముత్తయ్య, లేళ్ల నాగేంద్రరెడ్డి, బంకా ప్రసాదరావు, యేశపోగు రవి, రమాకాంత్, నరమనేని సత్యం, నూతలపాటి పుల్లారావు, జొన్నలగడ్డ వెంకటాద్రి, పోలాది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన



వీరులపాడు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే డ్రైవర్లపై కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని వీరులపాడు గ్రామ సమీపంలో అధిక లోడుతో వస్తున్న వాహనాలను గుర్తించి డ్రైవర్లకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని, దీంతో ప్రమాదాల సమయంలో తీవ్రత అధికంగా ఉంటోందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండటంతోపాటు హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. అనంతరం నిబంధనలకు అతిక్రమిస్తూ రాకపోకలు సాగిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించారు.

సామాన్యులకు నాణ్యమైన వైద్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్పొరేట్ వైద్యం అత్యంత ఖరీదైన తరుణంలో సామాన్యులను నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు లక్ష్మీ ఫౌండేషన్ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ యూరాలజిస్ట్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. వెటర్నరీకాలనీ వినాయక్ థియేటర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీఫౌండేషన్ ఆస్పత్రిని ఆదివారం డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ చదలవాడ సుధలు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాభావంతో ఆస్పత్రిని ఏర్పాటు చేసి, నామమాత్రపు ఫీజులు వసూలు చేయడం మంచి పరిణామమన్నారు. లక్ష్మీ ఫౌండేషన్ ట్రస్టీ అబ్బూరి శారద మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఏడాదిన్నర కిందట లయోలా కళాశాల రోడ్డులో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. గైనకాలజీ, డయాబెటాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తామని తెలిపారు.

మక్కపేట..అభివృద్ధి బాట

- రూ.4 కోట్లతో గ్రామాభివృద్ధి..
- పెరిగిన మౌలికవసతులు
- మారిన పాఠశాల రూపురేఖలు

మక్కపేట(వత్సవాయి): జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాలకు అనుకూలంగా, నియోజకవర్గ కేంద్రానికి అతిసమీపంగా చిల్లకల్లు–వైరా రహదారిపై ఉన్న మక్కపేట గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో ఇప్పటివరకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు.



మక్కపేట జెడ్పీ పాఠశాల



పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సొసైటీ భవనం

రూ.80లక్షలతో సచివాలయాలు, ఆర్బీకే..

సచివాలయ వ్యవస్థ ద్వారా పేదలకు మెరుగైన సేవలను అందించేందుకు రూ.80లక్షలతో సచివాలయ భవనాలు, రైతు భరోసాకేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌కు నిర్మాణం చేపట్టారు. సచివాలయ భవనం పూర్తయి ప్రజలకు సేవలందిస్తుండగా రైతుభరోసా కేం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పనులు చివరిదశలో ఉన్నాయి.

రూ.35లక్షలతో పాఠశాలల అభివృద్ధి..

పేద ప్రజల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే లక్ష్యంతో నాడు–నేడు పథకం కింద మక్కపేటలోని పాఠశాలలను అభివృద్ధి చేశారు. నాడు–నేడు మొదటి విడత కింద రూ.20లక్షలతో పాఠశాల భవనాలకు మరమ్మతులు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, ఆర్వోప్లాంట్, పెయింటింగ్స్, గ్రీన్ చాక్ బోర్డు ఏర్పాటు తదితర పనులు చేశారు. రెండోవిడతలో రూ.14.40లక్షలతో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు.

జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్...

గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడోతరగతి వరకు చదువుకున్న విద్యార్థులు పైతరగతుల కోసం భీమవరం, గోపినేనిపాలెం, పెనుగంచిప్రోలు గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమస్యను 2020లో గ్రామస్తులు జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే విద్యాశాఖాధికారులతో మాట్లాడి ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించారు. దీంతో గ్రామంలోని విద్యార్థులకు ఇక్కట్లు తప్పాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.10కోట్లతో పేదలకు స్థలాలు..

మక్కపేటలోని పేదలకు ఇంటి స్థలాల కొనుగోలు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం రూ.1.10కోట్లతో ఏడెకరాల పొలాన్ని కొనుగోలు చేసింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన మోడల్‌కాలనీకి సమీపంలోనే జగనన్న కాలనీని ఏర్పాటు చేసి 270మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు.జగనన్న కాలనీలో బోర్లు ఏర్పాటుచేయడంతోపాటు విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే పలువురు ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకుని, నివాసం ఉంటున్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు శ్లాబుదశలో ఉన్నాయి.

రూ.75లక్షలతో ఆలయం...

గ్రామంలో పురాతనమైన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆస్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి రూ.75లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన ఆలయ నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.22లక్షలతో గోడౌన్..

ప్రాథమిక సహకార పరపతి సంఘం భవనానికి మరమ్మతులతోపాటు నూతన గొడౌన్ నిర్మిస్తున్నారు. రూ.22లక్షలతో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అదేవిధంగా గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.15 లక్షలతో సీసీరోడ్లు నిర్మాణం చేశారు.

ఇలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో మక్కపేటలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



సచివాలయ భవనం

వేగంగా అభివృద్ధి..



ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో గ్రామంలో కోట్లది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పేదలకు ఇంటి స్థలాలు, సచివాలయ భవనాల నిర్మాణం, నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి.

– కనగాల రమేష్, గ్రామపార్టీ అధ్యక్షులు

జగనన్న ప్రభుత్వాన్ని మరువలేం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే ఉదయభాను ప్రత్యేక చొరవతోనే గ్రామంలో ఇన్ని అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయి. గ్రామాన్ని అభివృద్ధి చేసిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని మరువలేం.

– అల్ల కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు

100 బస్తాల బియ్యం వితరణ



జగ్గయ్యపేట అర్బన్: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో నిరుపేదల కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి పలువురు దాతలు సహకారం అందస్తున్నారు. జగ్గయ్యపేట మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలసి రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి 100 బస్తాల బియ్యాన్ని వితరణగా ఆదివారం అందజేశారు. ఈ మేరకు రాజన్న ఉచిత భోజనం కార్యక్రమ నిర్వాహకులు జీవీడీ ప్రసాద్ వారికి రశీదును అందజేసి అభినందించారు. కౌన్సిలర్ కొలగాని రాము, సలాది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు జుజ్జూరులో వలంటీర్లకు వందనం

వీరులపాడు: మండలంలోని జుజ్జూరులో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహించే వలంటీర్ల వందనం కార్యక్రమానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

జగనన్న పాలనలో అందరికీ న్యాయం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కీసర(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కీసరలో ఆదివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పనితీరును ఆరాతీయగా, తమకు పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ అధినేత చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు మరోసారి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వస్తే గ్యారంటీగా పథకాలు అందిస్తామని చెబుతున్న టీడీపీ నాయకులు, గతంలో ఆయన ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. నందిగామ నియోజకవర్గాన్ని రూ.1500 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇంతటి సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అత్యున్నత పదవులలో కూర్చొబెట్టిన ఘనత కూడా సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో నందిగామ, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ నాయకులు వేల్పుల రమేష్ స్వామి, పరిటాల రాము, చలమల ప్రభాకరరావు, శివనాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కీసరలో ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గ నృత్య మందిరానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు సహస్ర, కావ్యశ్రీ, తన్వి, ధరణి, హరిషిత, నందినిలతో పాటు మరి కొందరు చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. విజయవాడకు చెందిన కెజే.మోహిని బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కళావేదికపై విజయవాడకు చెందిన జి.గౌరీ, రాజ్యలక్ష్మి, జగన్మోహని, అభిరామ్‌లు పలు కీర్తనలను ఆలపించారు.

నేటినుంచి రామలింగేశ్వరుడి కల్యాణోత్సవాలు

నందిగామ: స్థానిక మెయిన్‌రోడ్డులోని రామలింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్యం విశేష పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. ఈనెల 22వ తేదీ రాత్రి సుఖ శ్యామలాంబా సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణం జరగనుంది. 23వతేదీ సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి ఏటా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తూ ఉంటారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



విద్యుద్దీపాలంకరణలో రామలింగేశ్వరస్వామి ఆలయం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట శ్రీకల్యాణ షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం వినాయకుడు, షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గణపతి హోమం, లక్ష్మీగణపతి, నవగ్రహ, గురుదత్తాత్రేయ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జోరుగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్

నందిగామ: నవరత్నాల పథకాల్లో భాగంగా పేదలందరికీ జగనన్న కాలనీల్లో మంజూరుచేసిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నందిగామ డివిజన్‌లో శరవేగంగా సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆయా స్థలాలపై పేదలకు సంపూర్ణ హక్కులు ఉండేవిధంగా సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు ఇళ్లరిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది.ప్రతి సచివాలయ పరిధిలో పంచాయతీ కార్యదర్శులను జాయింట్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించి పేదలకు ఆయా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తోంది.

13609 రిజిస్ట్రేషన్లు పూర్తి..

నందిగామ డివిజన్ పరిధిలో ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. డివిజన్ లో మొత్తం 20,239 ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఇప్పటివరకు 18,846 ఇళ్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు టెక్నికల్‌గా క్లియరెన్స్ ఉంది. టెక్నికల్ క్లియరెన్స్ వచ్చిన ఇళ్లలో ఇప్పటివరకు 13,609 ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి అయింది. ప్రతి సచివాలయంలో రోజు పది రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తుండటంతో ఈ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఆయా సచివాలయాల్లో సాగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయా మండలాల తహసీల్దార్లతోపాటు నందిగామ ఆర్డీవో సాయిబాబా కూడా పర్యవేక్షిస్తున్నారు. సచివాలయాలను సందర్శిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఏమైనా సమస్యలు తలెత్తితే రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కూడా సహాయ సహకారాలు అందిస్తుండటంతో రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తవుతున్నాయి.



నందిగామలో సాగుతున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

చాలా సంతోషంగా ఉంది...



నాభర్త ఏడేళ్ల కిందట మృతి చెందడంతో మాఅమ్మ ఇంటి వద్దే ఉంటూ కూలిపనులు చేసుకుంటూ నా కూతురిని చదివించుకుంటున్నా.సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా సమకూరిన ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇంటిస్థలంపై హక్కులన్నీ మాకే చెందేలా చేయడం మాకు భరోసాగా ఉంది.

– ఆలేటి దానమ్మ, పాత ఎస్సీకాలనీ, నందిగామ

త్వరితగతిన రిజిస్ట్రేషన్లు..



గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నా. ముఖ్యంగా ప్రతి సచివాలయ పరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై మండలస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా. అన్ని ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తిచేస్తాం.

– పి సాయిబాబు, నందిగామ ఆర్డీవో

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎస్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో శ్రీ సీతారామ కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం మంటప దేవతా హోమాలు, మూలమంత్ర హోమాలు, చండీహోమం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, శ్రీరామ శ్రీహనుమన్మహమంత్ర హవనం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా జరిపారు. కార్యక్రమాల్లో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయ కార్యదర్శి జి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజశ్యామలాదేవి అలంకారంలో కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు భక్తులకు రాజశ్యామలాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మాఘ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు రాజశ్యామలాదేవి హోమం నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పూర్ణాహుతి సమర్పించారు. అరుణ పారాయణ సూర్య నమస్కారాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.





అమ్మ బయలెల్లినాదో...

రంగుల మహోత్సవం కోసం జగ్గయ్యపేటకు వచ్చిన శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలను భక్తులు ఆదివారం ప్రత్యేక పల్లకీల్లో తిరిగి పెనుగంచిప్రోలుకు తరలించారు. తొలుత వేదపడింతులు స్వామివార్లకు పూజలు చేశారు. పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు పలికారు. –జగ్గయ్యపేట









బహుమతుల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆత్మబంధు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బిపిన్ రావత్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ విజేతలకు ఆదివారం సీవీఆర్ స్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. టాలెంట్ టెస్ట్‌లో వి.శ్యామ్‌శరత్‌బాబు ప్రథమ, ధాత్రిశ్రీ లక్ష్మి ద్వితీయ, ఎం.కీర్తి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వీరికి నగదు బహుమతులు అందజేశారు.